## కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 25: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

## అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, డిసెంబర్ 25 : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొన్నది. ఆలయ ఈవో టంకశాల వెంకటేశం భక్తుల రద్దీని గమనిస్తూ ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రధాన ఆలయంలో ఆంజనేయస్వామి, లక్ష్మి అమ్మవారు, వేంకటేశ్వరస్వామితో పాటు అనుబంధ ఆలయాలైన భేతాళస్వామి, మునిగుహలు, కొండలరాయుడి అడుగుల నమూనాలు, కోదండ రామాలయం, బొజ్జపోతన తదితర ఆధ్యాత్మిక ప్రదేశాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### కొండగట్టు, వేములవాడలో జడ్పీ చైర్‌పర్సన్ పూజలు

జగిత్యాల: వేములవాడ రాజన్న సన్నిధిలో కోడెమొక్కు చెల్లించుకుంటున్న దావ వసంత

మల్యాల/జగిత్యాల, డిసెంబర్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దావ వసంత-సురేశ్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

# మెర్రీ మెర్రీ క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రిస్టియన్లు

*క్రైస్తవులు పవిత్రంగా జరుపుకొనే కిస్మస్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు యేసు జనన వృత్తాంతాన్ని సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు బైబిల్ గ్రంథాన్ని పఠించారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.*

జగిత్యాల టౌన్, డిసెంబర్ 25: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ, క్రైస్ట్, ఏసురత్నం చర్చిల్లో పాస్టర్లు జీవరత్నం, జకరియా ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీఎస్ఐ చర్చిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

రాయికల్, డిసెంబర్ 25: రాయికల్ పట్టణంతో పాటు గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేశారు.

సారంగాపూర్, డిసెంబర్25: సారంగాపూర్, బీర్‌పూర్ ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్, జడ్పీటీసీలు మేడిపెల్లి మనోహర్‌రెడ్డి, పాత పద్మ, వైస్ ఎంపీపీలు సొల్లు సురేందర్, బల్మూరి లక్ష్మణ్‌రావు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

కొడిమ్యాల, డిసెంబర్ 25: కొడిమ్యాలలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రశాంతి కేక్ కట్ చేశారు.

ధర్మపురి, డిసెంబర్ 25: ధర్మపురిలోని పెంతకోస్టు చర్చిలో పాస్టర్ శాంతకుమార్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెల్గటూర్, డిసెంబర్ 25: ఎండపల్లి మండలంలోని చెర్లపల్లి బిలీవర్స్ చర్చిలో ఫాదర్ క్యాతం యోనా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్తపేట, పడకల్ చర్చిల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీరెడ్డి మహేందర్‌రెడ్డి కేకులు అందజేసి, క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. పాస్టర్లు, చుంచు రాజేశ్, దావుల బొబెన్ని, అరుణ్, పల్లపు వెంకటస్వామి, కొప్పుల రాజేశ్, జంగిలి రమేశ్, లింగమూర్తి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, డిసెంబర్ 25: పైడిమడుగు, వెంకట్రావుపేట, మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, జోగిన్‌పెల్లి, కల్లూరు చర్చిల్లో పాస్టర్లు ప్రార్థనలు చేశారు.

మెట్‌పల్లి, డిసెంబర్25: మెట్‌పల్లిలో ధర్మపురి దేవస్థానం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు బెయేర్షాబా దవాఖాన వైద్య దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, కోశాధికారి శ్రీధర్, సభ్యులు శ్రీనివాస్‌రావు, అరుణ్‌దీప్‌గౌడ్, ఇల్లెందుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని కార్మెల్ నిబంధన చర్చితో పాటు, ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ అపోస్తల్, క్రైస్తవులు పాల్గొన్నారు.

కథలాపూర్, డిసెంబర్ 25: మండల కేంద్రంతోపాటు భూషణ్‌రావుపేట, తాండ్రియాల చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. సర్పంచ్ కూన సులోచన, పాస్టర్లు గసికంటి సామ్యేల్, పాలెపు రాజేశ్, గాంధారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ జీవరత్నం, హాజరైన క్రిస్టియన్లు

వెల్గటూర్: కొత్తపేట సీఎస్ఐ చర్చిలో భోజనం వడ్డిస్తున్న మహేందర్‌రెడ్డి

వెల్గటూర్: చెర్లపల్లిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ యోనా

మెట్‌పల్లి: కేక్ కట్ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## ఘనంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర

ధర్మపురిలో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మారుతీనగర్/ధర్మపురి/మేడిపల్లి, డిసెంబర్ 25: రామ జన్మభూమి అయోధ్యలో పూజించిన అక్షింతల కలశాలల ఎదుర్కోలు శోభాయాత్రను సోమవారం మెట్‌పల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామభక్తులు అక్షింతల కలశాలలను నెత్తిన పెట్టుకొని శ్రీరామ సంకీర్తనలు, భజనలతో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కోదండ రామాలయం వరకు శోభాయాత్రను కొనసాగించారు. శోభాయాత్రలో శ్రీరాముడు, సీత, హనుమాన్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మెట్‌పల్లి నగర శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పోహార్ తుకారాం, బెజ్జారపు మురళి, శ్రీనివాస్, హేమచందర్, ద్విజేందర్, రంజిత్, రాజేందర్, నాగయ్య, మట్టెల గంగాధర్, భూపతిగౌడ్, కిషన్, విక్రమ్, శంకర్ పాల్గొన్నారు. అలాగే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ధర్మపురిలోని హనుమాన్‌వాడలో గల హనుమాన్ మందిరం నుంచి గోదావరి ఒడ్డున గల రామాలయం వరకు శోభాయాత్ర సాగింది. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. శోభాయాత్రలో కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సంగి నర్సయ్య, పిల్లి శ్రీనివాస్, పల్లెర్ల సురేందర్, బండారి లక్ష్మణ్, గాజు భాస్కర్, రంగు లక్ష్మీనరహరి తదితరులున్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో మంగళాహారతులతో స్వామివారి అక్షింతలు ఊరేగించారు.

## శాంతిమార్గాన్ని అనుసరించాలి

- క్రిస్మస్ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి/గొల్లపల్లి/మేడిపల్లి, డిసెంబర్ 25: సర్వ మత గ్రంథాలు శాంతిని ప్రబోధిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, గొల్లపల్లిలో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర రాములుగౌడ్, ముస్కు నిషాంత్ రెడ్డి, సర్పంచులు శోభారాణి, గంగాధర్, సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు. భీమారం మండలం మన్నెగూడెం పల్లగుట్లపై అయ్యప్పస్వామి పడి పూజలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పెగడపల్లిలో బాలుడికి కేక్ తినిపిస్తున్న విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

## ఘనంగా సామూహిక గురు చరిత్ర పారాయణం

కోరుట్ల సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

కోరుట్ల, డిసెంబర్ 25: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం దత్త జయంత్యుత్సవాల్లో భాగంగా సామూహిక గురు చరిత్ర పారాయణం మహా యజ్ఞాన్ని నిర్వహించారు. అర్చకుల నిర్వహణలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, కంకణధారణ, అష్టోత్తర శతకలశ స్థాపన, దత్తాత్రేయ స్వామికి క్షీరాభిషేకం, దత్తాత్రేయ స్వామి హోమం, లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులకు ఉచితంగా గురు చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి అనూష, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### దుబ్బ రాజన్న ఆలయంలో భక్తుల పూజలు

సారంగాపూర్, డిసెంబర్ 25: జిల్లాలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోడె మొక్కులు, గదాశూళం, బెల్లం మొక్కులు, కుంపటి, అన్నపూజలు, అభిషేకాలు, తదితర మొక్కులు చెల్లించుకున్నారు.

### వెంకన్న అలయంలో ధనుర్మాస ఉత్సవాలు

కోరుట్ల, డిసెంబర్ 25: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు బీర్నంది లక్ష్మీనర్సింహాచార్యులు వైదిక నిర్వహణలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవ, ఆరాధన, పంచామృతాలతో అభిషేకం, తిరుప్పావై సేవ, పాశురం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పెడిమల్ల నర్సయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### రాగోజిపేటకు బస్సు ప్రారంభం

మేడిపల్లి, డిసెంబర్ 25: మేడిపల్లి మండలం కోండాపూర్, విలాయతాబాద్, భీమారం మండలం వెంకట్రావుపేట, ఒడ్డాడు, రాగోజిపేటకు సోమవారం కోరుట్ల నుంచి బస్సును ప్రారంభించారు. బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌కు గ్రామస్తులు ఇటీవల వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆదిశ్రీనివాస్ కోరుట్ల ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సును ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా విప్ ఆదిశ్రీనివాస్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### బాధిత కుటుంబానికి అండ

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 24: రాజేశ్వర్‌రావుపేటలో విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన గడ్డం చిన్నొళ్ల పెద్ద సత్తయ్య కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ధైర్యం చెప్పారు. సోమవారం బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.

### బాధితురాలుకి ఆర్థిక సాయం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 25: గుంలాపూర్‌కు చెందిన బోయిని వెంకటి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో వెంకటి భార్య లక్ష్మికి శ్రీవెంకటేశ్వర మిత్ర బృందం సోమవారం రూ. 40,500 ఆర్థిక సాయం అందజేశారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లి, డిసెంబర్ 25: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తెలిపారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.

### ప్రమాదవశాత్తు బైక్ దగ్ధం

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 25: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ ప్రమాదవశాత్తు మంటలంటుకొని పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన యూసుఫ్ తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. కాగా షార్ట్‌సర్క్యూట్‌తో వాహనం నుంచి మంటలు రాగా, క్షణాల్లోనే పూర్తిగా కాలిపోయింది.

### బీజేపీకి శ్రీనివాస్ రాజీనామా

కోరుట్ల, డిసెంబర్ 25: బీజేపీ ప్రధాన పట్టణ కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. 179 బూత్ అధ్యక్షురాలు పోతుగంటి అరుణ కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

## జిల్లా స్థాయి కరాటేలో షాహిక్‌కు సిల్వర్ మెడల్

పెగడపల్లి, డిసెంబర్ 25: మండల కేంద్రానికి చెందిన మూడో తరగతి చదువుతున్న ఎండి.షాహిక్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయిలో కరాటే పోటీల్లో షాహిక్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. షాహిక్‌కు బీఆర్ఎస్ రాష్ట్ర నేత, పెగడపల్లి సహకార సంఘం చైర్మన్ వొరుగంటి రమణారావు, నిర్వాహకులు సిల్వర్ మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు.



పెగడపల్లి: షాహిక్‌కు సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత రమణారావు

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కోరుట్ల విద్యార్థులు

- 30 పతకాలు సాధించిన ఒకినావా స్కూల్

కోరుట్ల, డిసెంబర్ 25: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 30 పతకాలు అందుకున్నారు. డిసెంబర్ 24న జిల్లా కేంద్రంలో 4వ తెలంగాణ స్టేట్ లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ -2023, ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కోరుట్లకు చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు కటా, కుమ్మితే విభాగంలో 30 పతాకాలు కైవసం చేసుకున్నట్లు కోచ్ అల్లే రమేశ్ సోమవారం తెలిపారు. 6 బంగారు పతకాలు, 9 వెండి పతకాలు, 15 కాంస్య పతకాలు గెలుపొందారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ మారంపల్లి శ్రీనివాస్, జిల్లా చైర్మన్ ఓరుగంటి వెంకట రమణ రావు ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలను అందజేశారు. విద్యార్థులను కరాటే చీఫ్ వసంత్ కుమార్ అభినందించారు.

కోరుట్ల: పతకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

### అవిశ్వాసానికి హాజరు కావద్దు

మల్యాల, డిసెంబర్ 25: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై విశ్వాసం కోల్పోయామని బలపరీక్షను ఏర్పాటు చేయాలని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తికి పది మంది ఎంపీటీసీలు విన్నవించారు. దీంతో జనవరి 10న ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానంపై తమ నిర్ణయం తెలుపేందుకు 14 మంది ఎంపీటీసీలకు ఆర్డీవో నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం తాటిపల్లిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండలాధ్యక్షుడు నేరేళ్ల శ్రావణ్‌రెడ్డి నేతృత్వంలో ఎంపీటీసీలు సంగాని రవి, ముదుగంటి వని త- రాజుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ నిర్ణయం మేరకు ఎంపీటీసీలు ఎవరూ ఎంపీపీపై పెట్టిన బలవిశ్వాస పరీక్షలో పాల్గొనకూడదని నిర్ణయించినట్లు బింగి వేణు తెలిపారు.

### లఘు చిత్రం షూటింగ్

వెల్గటూర్, డిసెంబర్ 25: కోటిలింగాల చరిత్రను ఆధారంగా చేసుకుని పెద్దపల్లికి చెం దిన యూట్యూబ్ చానల్ డైరెక్టర్, జబర్దస్త్ నటుడు నీలి శ్రీకాంత్ కోటిలింగాల ఆలయం లో సోమవారం లఘు చిత్రాన్ని షూటింగ్ చే శారు. చిత్రంలో ఆంజనేయులు, బొడ్డుపల్లి రాంమూర్తి, సీతామహాలు, కంది సంపత్, ట్యాంక్ జయదేవ్ నటించారు.

## రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి

కోరుట్ల, డిసెంబర్ 25: యాసంగి వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో తక్షణమే రైతుబంధు నిధులను విడుదల చేయాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంట సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయడానికి డబ్బులు అవసరమతాయన్నారు. పంట అవసరాల నిమిత్తం రైతుబంధు డబ్బుల కోసం రోజుల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతుబంధు డబ్బులు అందక రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారన్నారు. పంట అవసరాల నిమిత్తం రైతుబంధు డబ్బుల కోసం రోజుల తరబడి రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు . అన్నదాతల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని త్వరగా రైతుబంధు డబ్బులను రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## విద్యాసాగర్‌రావు అయ్యప్ప దీక్ష మాలధారణ

అయ్యప్ప ఆలయంలో మాలధారణ చేస్తున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మారుతీనగర్, డిసెంబర్ 25: మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గూడెం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమచారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సోమవారం అయ్యప్ప దీక్ష మాలధారణ చేశారు. 35వ సారి అయ్యప్ప దీక్షను తీసుకోగా పలువురు గురుస్వాములు, వేదపండితులు ఆయనను సత్కరించారు. కాగా అయ్యప్ప ఆలయంలో మంగళవారం నిర్వహించే మహాపడి కార్యక్రమానికి భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొనాలని కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు గంగుల వివేక్, నారాయణ, మంత్రి అంజయ్య, లవ కుమార్, గడ్డం మధు, చిద్రాల నారాయణ, మర్రి నర్సయ్య, నాని, రాజశేఖర్, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పద్మశాలీ సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక

కొడిమ్యాల, డిసెంబర్ 25: మండల కేంద్రంలో సోమవారం పద్మశాలీ సంఘం పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా మార్గం అశోక్, ప్రధాన కార్యదర్శిగా వీరబత్తిని రాజు, కోశాధికారిగా అంకం మహేందర్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీ పడగా మార్గం అశోక్ గెలుపొందారు. కార్యక్రమంలో మండల నాయకులు దేవేందర్, రాచర్ల శ్రీనివాస్, మార్గం చిరంజీవి, కట్టెకొల రాజు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నికల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

## మేడిపల్లిలో పర్యటించిన జడ్పీ ఉపాధ్యక్షుడు

మేడిపల్లి, డిసెంబర్ 25: కోరుట్ల పట్టణంలోని సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న దత్తత్రేయ పారాయణంలో సోమవారం జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కోరుట్ల పట్టణంలో మేడిపల్లి ఎంపీటీసీ అంకం వినోద, విజయసాగర్ తమ్ముడి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమారం మండలం మన్నెగూడెంలో పడిపూజ కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు. భీమారం మండలం రాగోజిపేట సర్పంచ్ బాలసాని లహరిక, మారుతిగౌడ్ తమ్ముడి కుమారుడు పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే భీమారం మండలం వెంకట్రావుపేటకు చెందిన సురకంటి శ్రీనివాస్ మృతి చెందగా హరిచరణ్‌రావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, సర్పంచులు కాచర్ల సురేశ్, ఈర్నాల సంపత్‌కుమార్, రైతు సమన్వయ సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కోరుట్ల సాయిబాబా ఆలయంలో దత్తత్రేయ పారాయణంలో పాల్గొన్న జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు

## తలనీలాల సేకరణకు 30న టెండర్

మల్యాల, డిసెంబర్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో 1 జనవరి 2024 నుంచి 31 డిసెంబర్ 2024 వరకు ఏడాది కాలపరిమితితో స్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలాలను సేకరించుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేశం తెలిపారు. ఈనెల 30న కార్యాలయ ఆవరణలో ఈ-టెండర్ కమ్ సీల్డ్ కమ్ బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధరావత్తు సొమ్ము, షెడ్యూల్ ధర, ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో లేదా సెల్ నెంబర్‌లో 9942778154, 9494463300,9490010887 సంప్రదించాలని సూచించారు.

## జగిత్యాల పట్టణంలో వరుస చోరీలు

### మొన్న ఐదు.. నేడు నాలుగు ఇండ్లలో చొరబడ్డ దొంగలు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 25 : జగిత్యాల పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం బ్రాహ్మణవాడలో ఐదు ఇండ్లకు కన్నం వేసిన చోరులు సోమవారం పట్టణంలో మరో మారు ప్రవేశించి నాలుగు ఇండ్ల తాళాలు పగులగొట్టారు. జగిత్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌లో తాళం వేసిన నాలుగు ఇండ్లలో దొంగలు చొరబడ్డారు. తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఇంటి యజమానులు ఇంట్లోని బంగారు నగలు, నగదు వెంట తీసుకెళ్లడంతో చోరులు ఉత్త చేతులతో వెళ్లిపోయారు. మూడు రోజుల క్రితం బ్రాహ్మణవాడలో ఐదు ఇండ్ల తాళాలు పగలగొట్టి మూడు తులాల బంగారు నగలు, రూ. 40వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మరువకముందే మరో మారు చోరీ జరుగడంతో ప్రజలు అభద్రతాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు సుంకె పరామర్శ

కొడిమ్యాల, డిసెంబర్ 25: మండలంలోని కొండాపూర్‌కు చెందిన గుండు విజయ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, ఉపసర్పంచ్ కొలపూరం రమేశ్, చింతల్లపల్లి సర్పంచ్ మల్యాల మహిపాల్, డైరెక్టర్ మాంకాళి గంగరాజం, గుండు రాజుకుమార్, బోడ్డు నరేశ్, గుండు దేవయ్య, అనంద్, ప్రవీణ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రవిశంకర్